క్లుప్తంగా

6న మండల మీట్

దొర్నిపాడు: ఈనెల 6వ తేదీన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీపీ అమర్ నాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

చేతి పంపులకు మరమ్మతులు

ఉయ్యాలవాడ : వేసవిని దృష్టిలో వుంచుకుని గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ తెలిపారు. మండలంలో 59 చేతి బోర్లు ఉండగా, అందులో 56 బోర్లు పని చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో, పాఠశాలల ఆవరణలోనున్న రెండు, తుడుమలదిన్నె, పుచ్చకాయలపల్లె గ్రామాల్లోని రెండు బోర్లకు మరమ్మతులు చేశామని బుధవారం చెప్పారు. సర్పంచ్ మేకల ఓబులేసు మరమ్మతులను పరిశీలించారు.

పింఛన్ సొమ్ము మంజూరు

ఉయ్యాలవాడ : ఈ నెలకు సంబంధించి వైఎస్సార్ పింఛన్ కానుక డబ్బులు మంజూరయ్యాయని మండల పరిషత్ పరిపాలనాధికారి పార్థసారధి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 3,981 మంది లబ్ధిదారులకు రూ. 1,17,63,300 ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామ వలంటీర్లకు అందజేసినట్లు వెల్లడించారు. ఈనె 1న వారికి పింఛన్ సొమ్ము పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు.

కులగణన వేగవంతం చేయాలి



క్రిష్టిపాడులో కొనసాగుతున్న కులగణన

దొర్నిపాడు: కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి బుధవారం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఇప్పటి వరకు 95 శాతం పూర్తయ్యిందన్నారు. మిగిలిన మొత్తాన్ని వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఈనెల 4వ తేదీ వరకు మాత్రమే గడువుందని తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.

జయదేవ్ సేవలు మరువలేనివి



పదవీ విరమణ పొందిన జయదేవ్‌ను సన్మానిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

నంద్యాల (సెంట్రల్): నంద్యాల జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకుడిగా కే. జయదేవ్ రైతులకు ఎంతగానో తోడ్పడ్డారని, ఆయన సేవలు మరువలేనివని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు ప్రశంసించారు. జయదేవ్ పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఆత్మీయ సభ నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న వివిధ పథకాలు, పంటలు సరళిపై అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించారని కితాబునిచ్చారు. జీవ సాంకేతిక ప్రయోగశాల ఏఓ కళ్యాణ్, అయుబ్ బాషా, ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పోటీ పడండి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): గత 25 ఏళ్లుగా శిల్పా సేవా సమితి ద్వారా ప్రజలకు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, చేతనైతే సేవా కార్యక్రమాల్లో తమతో పోటీ పడాలి కాని, చేస్తున్న కార్యక్రమాలను విమర్శించడం సరికాదని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి హితవు పలికారు. కరోనా కష్టకాలాల్లో ప్రజల మధ్య ఉంటూ వారికి సేవలు అందించి భరోసానిచ్చామని తెలిపారు. స్థానిక శిల్పా సేవా సమితి కార్యాలయ ఆవరణలో బుధవారం శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా 185 మంది పేదింటి మహిళలకు రూ.25.65 లక్షల రుణాలను బ్యాంకు చైర్‌పర్సన్ శిల్పానాగినిరెడ్డితో కలిసి అందజేశారు.

'ఎస్పీ'తో సామాజిక న్యాయం

నంద్యాల(సిటీ): సమాజ్‌వాదీ పార్టీతో సామాజిక న్యాయం జరుగుతుందని పార్టీ రాయలసీమ జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ పాండురంగ యాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిలా అధ్యక్షుడు పెరుగు శివకృష్ణయాదవ్, రాజేష్, మధు, హనుమంత్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

శిరివెళ్ల: మండల స్థాయి ఖోఖో పోటీల్లో విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన గోవిందపల్లె జట్టును గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, ఉప సర్పంచు ఇందూరి శేషారెడ్డి, సూరి బుధవారం అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి గ్రామానికి పేరు తీసుకురావాలని సూచించారు.

దిగుబడులు భద్రం

- రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానంగా గోదాముల ఏర్పాటు
- జిల్లాకు 133 గోడౌన్లు మంజూరు
- ఇప్పటికే 103 పనులు పూర్తి
- ఈ నెలలో వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం



ధాన్యం ఆరబోసేందుకు ఏర్పాటు చేసిన ప్లాట్ ఫారం

శిరివెళ్ల: రైతులు పండించి పంటకు సరైన ధర లేకపోతే ధాన్యం భద్రపరుచుకునేందుకు ఇప్పటి వరకు ప్రైవేట్ గోదాములను ఆశ్రయించేవారు. అక్కడ వారు నిర్ణయించిన ధర ప్రకారం చెల్లించేవారు. అన్నదాతల అవస్థలను గమనించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా బహుళ వ్యవసాయ గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు నంద్యాల జిల్లాకు 133 గోడౌన్లను ఇప్పటికే మంజూరు చేయగా ప్రస్తుతం 103 నిర్మాణాలు పూర్తయ్యాయి. శిరివెళ్ల మండలంలో 16 రైతు భరోసా కేంద్రాలకు గాను 16 గోదాములు మంజూరయ్యాయి. అందులో 7 గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రభుత్వం గోదాముల సామర్థ్యాన్ని బట్టి నిధులు విడుదల చేసింది. నిర్మాణాలు పూర్తయిన వాటిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెలలో వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. ఈ మేరకు వాటిని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ గోదాముల్లో నెలకు ఒక బస్తాకు రూ.5 బాడుగ వసూలు చేస్తున్నారు. అలాగే వాటికి బీమాకు మరింత అదనంగా చెల్లించాల్సి వస్తుంది. ఈ బీమా ఆయా గోదాముల యజమానులను బట్టి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కాగా ప్రస్తుతం ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులోనున్న గోదాములో నెలకు బస్తాకు రూ.1 బాడుగ, రూ.1 బీమా వసూలు చేస్తున్నారు. అయితే నూతన గోదాములకు సంబంధించి ఇంకా విధి విధానాలు విడుదల కాలేదు. గోడౌన్ల నిర్వహణను స్వయం సహాయక సంఘాలు లేదా ఆర్‌బీకేలకు అప్పగించే అవకాశముంది.

త్వరలోనే ప్రారంభిస్తాం

రైతుల కోసం గోదాముల నిర్మాణాలు జరుగుతున్నాయి. నంద్యాల జిల్లాకు 133 గోదాములు మంజూరు కాగా 103 పూర్తయ్యాయి. శిరివెళ్ల మండలంలో 7 గోదాములు పూర్తయ్యాయి. ఫిబ్రవరిలో సీఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారు. రైతు భరోసా కేంద్రాలకు గాని, సహకార సంఘాలకు గాని గోదాముల నిర్వహణను ప్రభుత్వం అప్పగించనుంది. ఇంకా విధి విధానాలు జారీ కావాల్సి ఉంది.

– సుబ్బారెడ్డి, డీఈ, మార్కెటింగ్



శిరివెళ్లలో పూర్తయిన గోదాముల నిర్మాణాలు

మండలానికి మంజూరైన గోదాములు, నిధులు..

గ్రామం	సామర్థ్యం	మంజూరు
శిరివెళ్ల 3	2వేల మెట్రిక్ టన్నులు	రూ.1.50 కోట్లు
జీనేపల్లె	500 మెట్రిక్ టన్నులు	రూ.40లక్షలు
మహదేవపురం	500 మెట్రిక్ టన్నులు	రూ.36లక్షలు
బోయలకుంట్ల	500 మెట్రిక్ టన్నులు	రూ.36 లక్షలు
చెన్నూరు	వెయ్యి మెట్రిక్ టన్నులు	రూ.66 లక్షలు

రైతులకు ఎంతో మేలు



మా గ్రామంలో ప్రస్తుతం గోడౌన్ నిర్మించారు. ఊరిలో గోదాము ఉండటం వల్ల స్థానిక రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. మేము పండించిన పంటలకు ధర వచ్చేంత వరకు దూర ప్రాంతాల్లో నున్న ప్రైవైట్ గోడౌన్లకు తీసుకెళ్లం ఇబ్బందిగా ఉండేది. సొంతూర్లోనే ఉంటే బాడుగ భారం తగ్గుంది.

– మేర్వ రామసుబ్బారెడ్డి, చెన్నూరు

ప్రభుత్వ నిర్ణయం బాగుంది



రైతులకు ప్రభుత్వం మేలు చేస్తుంది. దగ్గర్లోనే గోడౌన్ల కట్టడం సరైన నిర్ణయం. పండించిన పంటలకు మంచి ధర వచ్చే వరకు తాము మండలం, పట్టణాల్లో ఉన్న గోదాములకు దిగుబడులను తరలించేవాళ్లం. ఇప్పుడు మా ఊరి బయటనే ఏర్పాటు చేసి అవస్థలు తప్పించింది.

– వెంకటేశ్వరరెడ్డి, రైతు, వెంకటాపురం

ఆసరాతో మహిళల అభివృద్ధి



21వ వార్డులో మాట్లాడుతున్న సునీతఅమృతరాజ్



31వ వార్డు మూలసాగరంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): ఆసరాతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 37, 31, 21, 40, 1 వార్డుల్లో 4వ విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వారు మాట్లాడుతూ మహిళలు జీవనోపాధికి మార్గాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రానున్న కాలంలో మహిళలు తమ జీవనోపాధులతో కుటుంబాన్ని నడిపించనున్నారని చెప్పారు. రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, కౌన్సిలర్లు అనురాధ, సంజీవ, వార్డు ఇన్‌చార్జ్‌లు అమృతరాజ్, సుజాత, సరళాదేవి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన



నమూనాలు సేకరిస్తున్న అధికారులు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో రూ.14లక్షలతో నిర్మించిన సీసీరోడ్ల నాణ్యతను విజిలెన్స్ ఏఈ నాగలక్ష్మయ్య, పీఆర్ ఏఈ కొండయ్య బుధవారం పరిశీలించి నమూనాలను సేకరించారు.నిర్మాణ పనులపట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంట్రాక్టర్ నజీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యామిని ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



పదవీ విరమణ పొందిన శివశంకరుడిని సత్కరిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని కోటకొండ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివశంకరుడు అనే ఉపాధ్యాయుడు బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు దేగాని వెంకటేష్, ఎంఈఓలు కోటయ్య, లక్ష్మి, తోటి ఉపాధ్యాయులు, వివిధ గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ కోటయ్య మాట్లాడుతూ శివశంకరుడు తన 37 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దారని అభినందించారు.

ఎంపీడీఓకు సన్మానం

నంద్యాల(అర్బన్): వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీపై వెళ్తున్న నంద్యాల మండల ఎంపీడీఓ సుగుణశ్రీని ఈఓఆర్‌డీ మహీధర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓను సత్కరించారు.

ఆర్థిక సాయం

శిరివెళ్ల: మండలంలోని గుంప్రమాన్‌దిన్నెకు చెందిన వ్యవసాయ కూలీ సానికే మరియమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. దీంతో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి వరకూటి రాజారెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి రూ.5 వేల నగదు సాయంగా అందజేశారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఆళ్లగడ్డ: స్థానిక డిపో నుంచి ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న బస్సు సర్వీసులను డిపో మేనేజర్ ఇటీవల తొలగించారని తొలగించిన సర్వీసులన్నింటినీ పునురుద్ధరించాలని వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజరావు కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని కలిసి రద్దు చేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా డిపో నుంచి నడుస్తున్న తిరుపతి, ఒంగోలు, కర్నూలు, హైదరాబాద్, శ్రీశైలం, విజయవాడ, మైదుకూరు సర్వీసులు రద్దు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. గ్యారేజీ సెక్రటరీ ప్రసాద్, ఎస్పీ గురువయ్య, మాచర్ల, నారాయణ తదితరులున్నారు.

స్థలాల రిజస్ట్రేషన్లు వేగవంతం చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

నంద్యాల(అర్బన్): నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామ సచివాలయంలో జరుగుతున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం నంద్యాల సబ్ రిజిస్ట్రార్ సునందతో కలిసి పరిశీలించారు. గ్రామంలోని 153 మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటి వరకు ముగ్గురికి మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తి కావడం, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను సచివాలయ సిబ్బంది జేసీ దృష్టికి తెచ్చారు. తక్షణమే సమస్యను పరిష్కరించిన జేసీ మాట్లాడుతూ త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి లబ్ధిదారుల్లో ఆనందం నింపాలని చెప్పారు. కార్యక్రమంలో పీఎస్ భార్గవి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు

గోస్పాడు: సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్ తెలిపారు. బుధవారం ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక పరిజ్ఞానంపై వృత్తి విద్యా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ కోర్సులపై విజ్ఞాన యాత్రలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో పది, ఇంటర్ విద్యార్థులు 156 మంది టెక్నాలజీపై ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై కళాశాల అధ్యాపకులు వివరించారు. వొకేషనల్ ఉపాధ్యాయులు విజయమ్మ, నరేష్‌బాబు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ ముందుండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు క్రీడలు జరుగుతాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్, ఆరు నియోజకవర్గాల క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నదానంతో పుణ్యఫలం

నంద్యాల(వ్యవసాయం): అన్నదాన కార్యక్రమం నిర్వహించడం వల్ల పుణ్యం లభిస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గుడిపాటిగడ్డలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కమిటీ గౌరవాధ్యక్షుడు గుడిపాటి ప్రసాద్, మిద్దె సుబ్బయ్య నాయకులు దండే సుధాకర్, శ్రీనివాసులు, ఉప్పు జగన్ ప్రసాద్, ప్రతాపరెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

నంద్యాల ఆర్‌డీఓగా మల్లికార్జునరెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల ఆర్‌డీఓగా మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ ఆర్‌డీఓగా పని చేస్తున్న ఏ.శ్రీనివాస్ జమ్మలమడుగు ఆర్‌డీఓగా బదిలీపై వెళ్లారు. మహేశ్వరరెడ్డి పదోన్నతిపై డోన్ ఆర్‌డీఓ నియమితులయ్యారు. కుందూనది పునరుజ్జీవ కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వి.ఉమామహేశ్వరి బదిలీపై వచ్చారు. నంద్యాల డీఆర్‌ఓగా ఉన్న పుల్లయ్య చిత్తూరు డీఆర్‌ఓగా బదిలీ కాగా పద్మజ నంద్యాల డీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అలాగే పలు మండలాల తహసీల్దార్లు ఇతర జిల్లాలకు బదిలీ కాగా అక్కడి నుంచి నంద్యాల జిల్లాకు బదిలీపై వచ్చారు. నంద్యాల జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్లలో ప్రతాపరెడ్డి, సునితబాయి, నాగభూషణం, ఫణికుమార్, ఎస్‌బీ భాస్కర్, వెంకటనారాయణ, నాగరాజు, మురళీమోహన్, సుమతి, బాబురాజేంద్రప్రసాద్, జయప్రకాష్, కె.బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, భార్గవి, వెంకటరమణ, రమణమ్మ, విజయకుమారి, చంద్రశేఖర్, మధురవాణి, రవీంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి, రామచంద్రుడు, నజీర్‌అహమ్మద్, గుర్రప్ప, తిరుపతయ్య, రత్నకుమారి, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, తులశమ్మ, తదితరులను బదిలీ చేస్తూ ప్రభుత్వ సీసీఎల్‌ఏ అడిషనల్ సెక్రటరీ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరిని ఏ మండలానికి నియమించాలనే దానిపై త్వరలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, తదితర విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈమేరకుఎంఈఓ బ్రహ్మంనాయక్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కుమార్, నాగార్జున మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన సాగిస్తున్నారని ఆరోపించారు.

రూ.85.66 కోట్లతో నంద్యాల మున్సిపల్ బడ్జెట్

- 2024–25కు రూ.1.18కోట్ల మిగులు బడ్జెట్‌కు ప్రతిపాదనలు
- మున్సిపాలిటీలో జరుగుతున్న పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా



బడ్జెట్‌ను వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన సభ్యులు

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణాభివృద్ధికి ఊతమిచ్చేలా 2024–25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను రూ.85.66 కోట్లతో రూపొందించారు. బడ్జెట్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా ఆధ్వర్యంలోని కౌన్సిల్ సభ్యులు బుధవారం ఆమోదం తెలిపారు. 2024–25వార్షిక మున్సిపల్ అధికారులు రూ.1.18 కోట్లతో మిగులు బడ్జెట్‌ను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. 2023–24లో రూ.69.71కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్‌ను 2023–24 రివైజ్‌డ్ బడ్జెట్ కింద రూ.74.44 కోట్లతో అధికారులు పనులు చేశారు. పట్టణాభివృద్ధి కోసం రోడ్లు, డ్రైన్లు, తాగునీటి కోసం అనేక పైప్‌లైన్ నిర్మాణ పనులతో గత వార్షిక బడ్జెట్ అత్యంత ప్రత్యేకం కాగా 2024–25కు సంబంధించిన బడ్జెట్ మరింత వేగంగా పట్టణాభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. బడ్జెట్ పద్దులను కమిషనర్ రవిచంద్రారెడ్డి రెవెన్యూ, మూలధన ఖాతాలకు సంబంధించిన పలు రకాల ఆర్థిక రాబడులు, వ్యయాలను కౌన్సిల్‌కు వివరించారు.

బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యయాలు..

- ➡ జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలోని సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఈ సంవత్సరం అధిక ప్రాధాన్యత ఇచ్చారు.
- ➡ రూ.40కోట్లు వెచ్చించి సౌకర్యాలను మెరుగుపరచనున్నారు.
- ➡ పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని కుళాయిల పైప్‌లైన్‌ల నిర్మాణాలకు రూ.2కోట్లు, వాటి మరమ్మతులకు రూ.2.30 కోట్లు, బోర్‌పాయింట్లకు రూ.0.61కోట్లు, డ్రింకింగ్ వాటర్ యూనిట్ల కోసం రూ.0.25 కోట్లు వెచ్చించనున్నారు.
- ➡ వార్డు సచివాలయాల అద్దెల కోసం రూ.0.45 కోట్లు, అమృత్ లోన్ వడ్డీ కోసం రూ.9కోట్లు ఖర్చుచేయనున్నారు.
- ➡ ఎలక్ట్రిసిటీకి రూ.5 కోట్లు, ఫ్యూయల్ చార్జ్‌ల కింద రూ.1.80 కోట్లు నిధులు వెచ్చించనున్నారు. అనంతరం ప్రతి నెలా జరిగే కౌన్సిల్‌లోని అన్ని అంశాలను కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

కార్మికులకు సబ్బులు కూడా ఇవ్వరా?

మున్సిపల్ శానిటేషన్ కార్మికులకు రెండు మూడు నెలలకు ఒకసారి సబ్బులు, కొబ్బరి నూనె, గ్లౌవ్స్, చెప్పులు ఇవ్వాల్సి ఉండగా ఏడాది కాలంగా ఇవ్వడం లేదని వంద మందికి పైగా ఫిర్యాదు చేశారని దేశం సులోచన సభ దృష్టికి తెచ్చారు. శానిటేషన్ కార్మికులంటే వైద్యులతో సమానమని వారిని సంరక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌కు ఉందని స్పష్టం చేశారు. కానీ సంవత్సర కాలంగా ఎవ్వరికీ సబ్బులు, ఆయిల్ ఇవ్వక పోగా పట్టణంలో ఎక్కడా బ్లీచింగ్ చేసిన దాఖలాలు లేవని ధ్వజమెత్తారు.అలాగే సురక్ష బిల్లులు, ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు లీజుకు తీసుకున్న అంశాలపై శ్వేత పత్రం విడుదల చేసి వారం పది రోజుల్లో మరోమారు కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈలు మధుకుమార్, శ్రీనివాసరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదం లేకుండా బిల్లులు చెల్లిస్తారా?

అనంతరం జరిగిన చర్చలో మాజీ చైర్‌పర్సన్, 18వ వార్డు కౌన్సిలర్ దేశం సులోచన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో జరిగే అభివృద్ధి పనులలో అవినీతికి తావు లేకుండా టెండర్ ప్రక్రియ ద్వారా చేసిన పనులకు కౌన్సిల్ అనుమతితో బిల్లులు మంజూరు చేయాల్సి ఉందని, అందుకు భిన్నంగా మున్సిపల్ కమిషనర్ కోట్లాది రూపాయల బిల్లులను కాంట్రాక్టర్లకు అందిస్తున్నారని ఇవన్నీ ఎలా సాధ్యమని నిలదీశారు. లోకల్ బాడీ ప్రమేయం లేకుండా బిల్లులు ఎలా విత్‌డ్రా చేస్తారని ప్రశ్నించారు.

– దేశం సులోచన

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ హనుమంతునాయక్

ఆళ్లగడ్డ: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హనుమంతునాయక్ హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన బాచ్చాపురంలో రాత్రి బస ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ,ఎస్‌ఐలు సిబ్బందితో కలిసి ఊరంతా కలియదిరిగారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలిసికట్టుగా ఉండి ప్రశాంతంగా జీవించాలని కోరారు. ఎస్‌ఐ నరసంహులు, సిబ్బంది ఉన్నారు.